క్లుప్తంగా

జెడ్పీ హైస్కూల్‌కు ఫిక్సిడ్ డిపాజిట్లు అందజేత

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు రూ.35 వేలు ఫిక్సిడ్ డిపాజిట్‌లు అందించినట్టు పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజు ఆదివారం తెలిపారు. జాజుల వీరవెంకట సందీప్, సాయిరాం వివేక్‌ల పేరుతో వారి తండ్రి జాజుల అవతారం రూ.10,116, పెనుగొండ ప్రకాష్ ఆర్బిబాల్డ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దినేష్ రూ.15 వేలు, పెనుగొండ ప్రసాద్‌రావు జ్ఞాపకార్థం ఆమె కుమార్తె ఈతకొట్టు విజలక్ష్మీబాయి రూ.5 వేలు, సత్యం పెద్దబ్బులు కుమార్తె సత్యం వెంకటశ్రీ చంద్రజ రూ.10,116, పెంటపల్లికి చెందిన మిర్తిపాటి శ్రీనివాస్ రూ.5 వేలు కలిపి మొత్తం రూ.45,348 ఫిక్సిడ్ డిపాజిట్ పాఠశాలకు అందించారన్నారు. ఈ మొత్తం మీద వచ్చే వడ్డీతో ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు


పూర్వ విద్యార్థులు సమకూర్చిన పుస్తకాలను పాఠశాలకు అందిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు, చర్మ సంబంధ, దంత సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం రూ.లక్ష వ్యయంతో పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు అందించారు. అలాగే సినీ హీరో మహేష్‌బాబు ఫౌండేషన్ నుంచి రూ.50 వేలు విలువ స్పోర్ట్స్ కిట్‌ను పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గళ్లా రాము, అలుమ్ని అసోసియేషన్ నాయకులు రత్నకుమార్, వర్మ, పీబీ శ్రీనివాస్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైనే వరద నీరు


ఏలేశ్వరంలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఏలేశ్వరం: ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రహదారిపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. వర్షాలు తగ్గినా సమీపంలోని కొండల నుంచి నీరు ఏకాధాటిగా రహదారిపైకి వస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని క్వారీ ప్రాంతంలో ఏజెన్సీ వెళ్లే ప్రధానరహదారిపై రోజుల తరబడి వర్షపునీరు పారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ప్రేమ విఫలమై విద్యార్థి ఆత్మహత్య

గండేపల్లి: ప్రేమ విఫలమై విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్టు గండేపల్లి పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు విజయనగరం జిల్లా సాలూరు మండలం, దేవబుచ్చియ్యపేట గ్రామానికి చెందిన గుంట్రెడ్డి మనోజ్ (21) గండేపల్లి మండలం సూరంపాలెంలో గల ఒక ప్రైవేటు కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని ప్రేమ విఫలం కావడంతో ఆదివారం తాను చదువుతున్న కళాశాల బాత్ రూమ్‌లో ఉరివేసుకుని మృతి చెందినట్టు తెలిపారు. తల్లితండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలియజేశారు.

వైద్య సేవలు నిల్.. కష్టాలు ఫుల్

- గోకవరంలో నిలిచిపోయిన 108 వాహన సేవలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


గోకవరంలో రిపేరుతో నిలిచిపోయిన 108 వాహనం

గోకవరం: అత్యవసర సమయంలో ఒక్క కాల్ చేస్తే వెంటనే చేరుకునే 108 అంబులెన్స్ ఇప్పుడు గోకవరం మండలంలో కనిపించడం లేదు. ప్రాణరక్షణగా నిలిచే 108 అంబులెన్స్ సేవలు మండలంలో నిలిచిపోయాయి. వాహనం నిలిచిపోయి సుమారు నెలరోజులు కావస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మండల ప్రజలు అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నెల రోజులుగా..

గోకవరం మండలంలో సుమారు నెల రోజుల నుంచి 108 వాహన సేవలు నిలిచిపోయాయి. వాహనం తరచూ రిపేర్లకు గురి కావడంతో గత కొద్దిరోజులుగా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనం స్ట్రెచర్ కూడా శిథిలావస్థకు చేరడంతో రోగులు, క్షతగాత్రులను వాహనం ఎక్కించడానికి సిబ్బంది అష్టకష్టాలు ఎదుర్కొనేవారు. ఆస్పత్రికి తరలించే సమయంలో మార్గమధ్యలో వాహనం నిలిచిన సందర్భాలు కూడా అనేకం చోటు చేసుకున్నాయి. వాహనం పూర్తిగా మరామ్మతులకు గురి కావడంతో వాహనాన్ని పూర్తిగా నిలిపివేశారు. దీనికి ప్రత్యామ్నాయ వాహనాన్ని ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినా, అత్యవసర సమయంలో రోగులను ఆస్పత్రికి తరలించాల్సి వస్తే సమీప మండలాలైన కోరుకొండ, దేవీపట్నం, గంగవరం మండలాల నుంచి వాహనం రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రైవేటు వాహనంలో..

ఇటీవల ఓ గర్భిణిని ఆసుపత్రికి తరలించడానికి 108 అందుబాటులో లేకపోవడంతో, కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనం అద్దెకు తీసుకోవాల్సి వచ్చింది. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించడాని సమీప మండలం నుంచి వాహనం వచ్చే క్రమంలో విలువైన సమయం వృథా కావడంతో ప్రాణాపాయం ఎదుర్కొన్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలు వేల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ వాహనాల్లోనే రోగులను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాణాలతో సంబంధం ఉన్న సేవలపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేయడం పట్ల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. వాహనం నిలిచి నెలరోజులు కావస్తున్నా ప్రత్యామ్నాయంగా ఇప్పటి వరకు 108 వాహనం ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అత్యవసర వైద్యసేవ నిలిచి ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నా పట్టించుకోకపోవడంతో ప్రజలపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే కొత్త 108 వాహనం ఏర్పాటు చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.


నిలిచిపోయిన 108 వాహనంలో పూర్తి శిథిలావస్థలో ఉన్న స్ట్రెచర్, ఇతర సామగ్రి

నూతన వాహనం మంజూరు చేయాలి

గోకవరంలో 108 వాహన సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే గోకవరం మండలానికి నూతన వాహనం మంజూరు చేయాలి.

– బాడితబోయిన చిన్నా, గోకవరం

గత ప్రభుత్వంలో మెరుగైన సేవలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 108 వాహన సేవలు మెరుగ్గా ఉండేవి. అత్యవసర సమయంలో 108కు ఫోన్ చేస్తే వెంటనే సేవలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటి సేవలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం తక్షణమే గోకవరం మండలానికి 108 వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– తోలేటి రాంప్రసాద్, గోకవరం

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజ


గోకవరంలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న విద్యార్థులు

గోకవరం: స్థానిక మద్దాల వారి వీధిలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని విద్యార్థులు సరస్వతీదేవి పూజ నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు సరస్వతీదేవికి పూజలు చేశారు. విద్యార్థులకు నిర్వాహకులు అట్టలు, పుస్తకాలు, పెన్నులు, పలకలను పంపిణీ చేశారు. అలాగే స్థానిక వెలమపేటలో గణేష్ మండపం వద్ద సరస్వతీదేవి పూజ నిర్వహించారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారంవారం నిర్వహించే అన్నదానానికి భక్తుల రద్దీ పెరిగింది. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గత నెల ఆషాఢ మాస జాతర ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. మళ్లీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారం వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు.

సురేష్‌కు దాడిశెట్టి రాజా పరామర్శ


తుని కొండవారిపేటలో సురేష్‌ను పరామర్శిస్తున్న దాడిశెట్టి రాజా

తుని: స్థానిక కొండవారిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సాకా సురేష్‌ను మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పరామర్శించారు. ఆదివారం ఉదయం పార్టీ నాయకులతో కలిసి సురేష్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేకతపై చేస్తోన్న పోరాటం అసమానమన్నారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రెడ్డిమిల్లి నానిబాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా రాజా పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి రేలంగి రమణాగౌడ్, రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి జాన్, కౌన్సిలర్లు చింతల సునీత, కిర్ర సత్య జగదీష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు


ఏలేశ్వరంలో కండక్టర్ ఎన్వీ రావును సన్మానిస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

ఏలేశ్వరం: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కండక్టర్ ఎన్వీ రావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్ ఆధ్వర్యంలో ఎన్వీ రావు దంపతులను ప్రత్యేక వాహనంలో లింగంపర్తి రోడ్, బాలాజీచౌక్ మీదుగా బాణసంచా కాల్పులతో ఊరేగించారు. స్థానిక ఎన్ కన్వెన్షన్‌హాలులో ఎన్వీరావు దంపతులకు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలు ఎప్పటికి జ్ఞాపకంగా మిగిలిపోతాయన్నారు. డిపో కార్యదర్శి యూబీఎం కుమార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పనిచేసిన ఎన్వీరావు సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి సత్యానందం, ఎన్ఎంయూ కార్యదర్శి త్రిమూర్తులు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ రుక్మిణీదేవి, నాయకులు బీఎస్‌రావు, ఎస్పీరావు, మాణిక్యం, బీవీరావు, ఎంఆర్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆవుల సంరక్షణకు చర్యలు


గోవులకు పశుగ్రాసం అందిస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: హిందూ సంస్కృతిలో ఆవును తల్లిగా పరిగణిస్తారని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జంతు హింస నివారణ సంఘంలో ఉన్న ఆవుల సంరక్షణ బాధ్యతలను ఆదివారం అసోసియేషన్ చేపట్టింది. ఆవులకు పశుగ్రాసం అందించారు. ఆవు పాలు అత్యంత విలువైనవని, తల్లిపాల తర్వాత పిల్లలకు పోషకాహారానికి ఆవు పాలు ప్రాథమిక వనరు అన్నారు. ఆవు జాతులను రక్షించేందుకు గోశాలలను కాపాడుకోవాలన్నారు. ప్రముఖ వైద్యులు వీరభద్రరావు మాట్లాడుతూ ఆవు పెంపుడు జంతువులకు అత్యంత అనుకూలమైనవని, పురాతన నాగరికతల నుంచి ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజంతో ముడిపడి ఉందన్నారు. భారత దేశానికి పశువుల పెంపకంలో గొప్ప చరిత్ర ఉందని, భారతదేశం పవిత్రమైన ఆవుల భూమిగా పరిగణిస్తారన్నారు.

సందడిగా నిమజ్జనాలు


గంగవరంలో వినాయకుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా ఆదివారం గణేశ్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చైతన్యనగర్, లింగవరంకాలనీ, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల నుంచి వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. స్థానిక మెయిన్ రోడ్, బాలాజీ చౌక్, హనుమాన్ జంక్షన్, మార్కెట్ వీధి, శివాలయం వీధి మీదుగా ఏలేరు కాలువలోని బ్రహ్మణ రేవు వద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 7న చంద్రగ్రహణం కావడంతో ఈ లోపు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా వినాయకుని ఊరేగింపు

జగ్గంపేట: స్థానిక బాలాజీ నగర్ ఆడిటోరియం వద్ద నెలకొల్పిన వినాయకుని ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. ఐదు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. వినాయకుని విగ్రహాన్ని వాహనంపై ఉంచి బాలాజీ నగర్ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం స్థానిక పుష్కర కాలువలో నిమజ్జనం చేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

తొండంగి: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో గణపతి నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. గోపాలపట్నం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భారీగా అన్నసమారాధన నిర్వహించారు. రావికంపాడు, వేమవరం తదితర గ్రామాల్లోనూ అన్నసమారాధనలు జరిగాయి. సాయంత్రం గణపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అన్నవరంలోని పంపా రిజర్వాయర్, తీరప్రాంతం వేమవరం బీచ్ సముద్ర తీరంలోనూ గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మరో నాలుగు రోజుల పాటు నిమజ్జన కార్యక్రమాలు, అన్నసమారాధనలు జరగనున్నాయి.

బాలగణపతికి గరిక పూజ

ప్రత్తిపాడు: స్థానిక తోటవీధిలోని బాలగణపతికి ఆదివారం గరిక పూజ నిర్వహించారు. పురోహితులు విద్యార్థులతో సరస్వతీ పూజ చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సుర్ల అప్పలనాయుడు, రమణ, అజిత్‌వర్మ, మణికంఠ, గంగాధర్, దంతులూరి బోస్ తదితరులు పాల్గొన్నారు.


రావికంపాడులో వినాయకుని ఊరేగింపు

రౌతులపూడి మండలంలో..

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాల, ఉప్పంపాలెం, రౌతులపూడి, బలరామపురం, గంగవరం, మెరక చామవరం, లచ్చిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో బాణసంచా కాల్పులు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్, డప్పు వాయిద్యాలతో స్వామివార్లను అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఏలేశ్వరంలో గణేష్ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


ప్రత్తిపాడులో బాలగణపతికి గరికపూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

రేపు వైఎస్సార్ వర్ధంతి


ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ గిరిబాబును కలిసిన న్యాయవాదులు

కిర్లంపూడి: ఈ నెల 2న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణ, మండల కేంద్రాలు, గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని కోరారు. ముద్రగడ గిరిబాబును సీనియర్ న్యాయవాదులు చెలంకూరి రామకృష్ణ, లింగంపల్లి శివకుమార్ కలిసి ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


లోకేష్‌ను పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కేదారి శేఖర్ కుమారుడు లోకేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. లోకేష్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మురళీకృష్ణంరాజు ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నానిపల్లి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరువు.. కరవు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- అరకొరగా పంపిణీ చేస్తున్న ప్రభుత్వం
- గగ్గోలు పెడుతున్న అన్నదాతలు


సీతారాంపురంలో రైతు సేవా కేంద్రం వద్ద ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

తొండంగి: రైతులకు ఎన్ని బస్తాల ఎరువులు కావాలంటే అన్ని బస్తాలు సొంత గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా తీసుకునే పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎరువుల పంపిణీలో విఫలం కావడంతో రైతులు ఎరువుల కోసం అష్టకష్టాలు పడుతున్నారు. నియోజకవర్గంలోనే అత్యధికంగా వరిసాగు జరుగుతున్న తొండంగి మండలంలో రైతులు ఎరువుల కోసం అగచాట్లు పడుతున్నారు.

12 వేల ఎకరాల్లో..

మండలంలోని పంపా ఆయకట్టు పరిధిలోని 12 వేల ఎకరాలు, పీబీసీ ఆయకట్టు పరిధిలో మరో ఐదువేల ఎకరాలతో పాటు వ్యవసాయబోర్లు పరిధిలో మరో రెండు వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు చేశారు. అతివృష్టి, అనావృష్టి నేపథ్యంలో మండలంలోని వ్యవసాయ బోర్లు, పీబీసీ, పంపా ఆయకట్టు ప్రాంతాల్లో దాదాపుగా 12 వేల ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. ఇంకా మరో ఏడు వేల ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. కృష్ణాపురం, పైడికొండ, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి. కోన శివారు గ్రామాల ప్రాంతాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో మరో వారం రోజుల్లో వరినాట్లు పనులు దాదాపుగా పూర్తికానున్నాయి.

కూటమి నేతల కనుసన్నల్లో..

ముందుగా వరినాట్లు పడిన ప్రాంతాల్లో ఇప్పటికే రెండు దఫాలు ఎరువుల వేయాల్సి ఉంది. కాగా ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు అరకొరగా ఎరువులు సరఫరా చేసింది. కూటమి నేతల కనుసైగల్లోనే తమకు నచ్చిన వారికి ఎరువులు అందుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి 19 వేల ఎకరాలకు బస్తా చొప్పున దాదాపుగా 19 వేల బస్తాల ఎరువులు అవసరం అవుతాయి. కాగా వీటిలో 50 శాతం ప్రైవేటు డీలర్లకు, మరో 50 శాతం ప్రభుత్వం మార్క్‌ఫెడ్ నుంచి రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో మండలంలోని రైతులకు మొదటి దఫాగా 281 మెట్రిక్ టన్నులు (6500 బస్తాలు) అవసరం కాగా 180 మెట్రిక్ టన్నులు(నాలుగువేల బస్తాలు) మాత్రమే వచ్చాయి. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే పంటలకు ఎరువులు వేసే సమయంలో మించిపోతుందన్న ఆతృతతో ఉన్న రైతులకు డిమాండ్ మేరకు ఎరువుల నిల్వ లేకపోవడంతో రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మండలంలోని సీతారాంపురంలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులు గంటల తరబడి పడిగాపులు కాశారు. బెండపూడిలో శుక్రవారం రాత్రి ఎరువుల కోసం రైతులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి తెచ్చి ముందుగా తమ వారికే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. దీంతో సాధారణ రైతులకు ఎరువుల దక్కడం లేదు. ప్రభుత్వం ఎరువుల సరఫరాలో పూర్తిగా విఫలమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు



మండలంలోని రైతులకు ఎరువుల బస్తాలు పూర్తి స్థాయిలో అందుతాయి. మొదటి దఫాగా 180 మెట్రిక్ టన్నులు నిల్వ వచ్చాయి. మరో రెండు రోజుల్లో మరో 100 మెట్రిక్ టన్నులు వస్తాయని ఉన్నతాధికారులు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దు. రైతులందరికీ ఎరువులు అందించేందుకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఎంఎంపీఎస్ పద్మశ్రీ, మండల వ్యవసాయశాఖాధికారి, తొండంగి

ఘనంగా భువనేశ్వరి మాత జయంతి వేడుకలు


భువనేశ్వరి పీఠంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: స్థానిక వర్జులవారి వీధిలో వేంచేసిన భువనేశ్వరి మాత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఓం శక్తి, ఆదిశక్తి పేరిట ప్రత్యేక అలంకరణ చేసి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.